# "ఆడబ్రతుకే మధురం"



## కొడవటిగంటి కుటుంబరావు


తాతయ్య అమ్మమ్మని ఇప్పటికీ కొడతాడు. నాన్న అమ్మని కొడతాడు. అక్కయ్యని బావ కొడతాడు. మొగవాళ్ళు ఆళ్ళని కొడతారు తిడతారు కూడానూ.

"ఆడబ్రతుకే మధురం" అని రేడియో పాడుతున్నది.

ఎంతో పాపం చేసుకుంటేనేగాని ఆడవాళ్ళయి పుట్టరుట, అమ్మమ్మ చెప్పింది. అందుకనే మొగవాళ్ళాడవాళ్ళని కొడతారు, తిడతారు.

మహాపతివ్రతలుకూడా వచ్చేజన్మలో ఆ మొగుడే కావాలని కోరుకుంటారు. ఆడజన్మ వొద్దని ఎందుకుకోరరో? ఈ జన్మలో ఆడవాళ్ళంతా పుణ్యంచేస్తే వచ్చే జన్మని ప్రపంచంలో ఆడవాళ్లే ఉండరు. అంతా మొగవాళ్ళే ఉంటారు. అప్పుడు మనమంతా కూడా క్రాపులు పెట్టుకొని, సూట్లేసుకుని, సిగరెట్టు కాలుస్తూ తిరగొచ్చు.

కిందటి జన్మలో చేసుకున్న పాపం విరగడైపోవటానికి ఆడవాళ్ళు మొగవాళ్ళచేత తన్నులూ, తిట్లూ తినాలి. చాకిరి చెయ్యాలి. నాన్నకూడా ఆఫీసుకెళ్ళి చాకిరిచేస్తాడు. అయితే నాన్నకాదివారం శలవు. అదీకాక ఎప్పుడన్నా వొంట్లో బాగుండకపోతే నాన్న ఆఫీసెగ్గొట్టి ఇంట్లో ముసుగుపెట్టుకు పడుకుంటాడు. అమ్మకి ఆదివారాలు లేవు, పని




ఎగ్గొట్టటానికి వీల్లేదు. ఎందుకంటే, మరి అమ్మకి జీతంలేదుగా!

కిష్టమూర్తిగారి పెళ్ళాం మంచి ఆడది కాదు. ఆవిణ్ణి మొగుడుకొట్టడు తిట్టడు. పైగా ముద్దుచేసి పాడుచేస్తున్నాడు. ఆవిడ మొహానికి పౌడరేసుకుంటుంది. మాటి మాటికీ సినిమాలకీ నాటకాలకీ పోతుంది. మీటింగులకు కూడా పోతుంది. వంట చెయ్యటానికి కట్టెలుపయోగించదు. ఆవిడకి కట్టెలంటె మంట. ఆవిడ మళ్ళీ వచ్చే జన్మలో కూడా ఆవిడకి కిష్టమూర్తిగారే మొగుడవుతాడు గామోలు. అయితే ఆవిడ కెప్పుడూ ఆడజన్మే, ఆవిడ ఖర్మం!

ఆడవాళ్ళు చదువుకోరాదు. చదువుకున్నా పెళ్ళయిపోగానే మానాలి. కిష్టమూర్తిగారి పెళ్ళాం పిల్లల తల్లిఅయి కూడా మొన్న మొన్నటిదాకా చదువుకుంటూనే ఉంది. ఆవిడ ఇప్పుడు బియ్యే పాసయింది. ఆడవాళ్ళంతా చదువు చదువుకుంటే చెడిపోతారు. అయితే కిష్టమూర్తిగారి పెళ్ళాం చెడిపోయినట్టు కనిపించదు. ఎప్పుడూ అందర్నీ నవ్విస్తూ మాట్లాడుతుంది. కాని నిజంగా చెడిపొయ్యే ఉంటుంది చిన్నపిల్లల కవన్నీ తెలియవు. అటువంటి విషయంలో ప్రశ్నలు వెయ్యరాదు.

కొందరాడవాళ్ళు చదువుకోకుండానే చెడిపోతారు. మూల ఇంటో హనుమాయమ్మ చెడిపోయిన బాపతేకాని చదువుకోలేదు. చదువుకోకుండా చెడిపోతే అది వాళ్ళ ఖర్మం.

కిష్టమూర్తిగారి పెళ్ళాం పిల్లల్ని కొట్టదు. "నిన్ను నీ మొగుడు కొడితే ఏంచేస్తావే?" అంటే వాళ్ళ వాణి "చంపేస్తా" అంటుంది. వాణికూడా

వాళ్ళమ్మల్లేనే ఎప్పటికీ ఆడదే అవుతుంది. దాన్ని వాళ్ళమ్మ పాడుచేస్తున్నది. వాణి అప్పుడే ఇంగ్లీషు చదువుతుంది. సినిమాపాటలు కూడా పాడుతుంది. అయితే ఏంలాభం ? పుణ్యమా పురుషార్థమా ? పిన్ని కూతురు సుశీల చక్కగా సంస్కృతంలో కుమార సంభవమూ అవీ చదువుకుంది. పాడు ఇంగిలీషు కాకుండా అది చక్కగా మువ్వ గోపాల పదాలు కూడా పాడుతుంది. పాడు సినిమాపాటలంటే దానికి అసహ్యం

"ఆడబ్రతులే మధురం" అని పాడుతున్నది రేడియో

ఆడవాళ్ళతో అన్నీ చిక్కులే. అమ్మ ఎడంగా ఉన్నప్పుడు నాన్న చేసే అల్లరి అంతా ఇంతాకాదు. తెగ గొణుక్కుంటాడు. ఆడవాళ్ళకు అన్నీ బాధలే. పిల్లల్ని కన్నప్పుడు చచ్చినంతపని అవుతుంది. బోలెడు డబ్బుఖర్చు. ఆడవాళ్ళతో అంతా ఖర్చే. ఒక చీర ఖరీదు పెడితే నాలుగు ధోవతులొస్తయ్. పిల్లల్ని కని కొంతమంది ఆడవాళ్ళు చచ్చిపోతారు. ముత్తైదు చావు చావటం ఎంతో పుణ్యం. వాళ్ళు మొగాళ్ళై పుడతారేమో. వెంకట సుబ్బమ్మ అవ్వగారు వచ్చే జన్మలో మొగవాడై పుడుతుంది. ఆవిడ కొడుకు స్వాములవారై పోయినాడు. పెద్దన్నయ్య స్వాములవారై పోతే అమ్మకూడా వచ్చే జన్మలో మొగవాడై పుడుతుంది.

ఆడపిల్లలుకూడా ఖర్చే. పెళ్ళిళ్ళు చెయ్యాలంటే బోలెడు కట్నాలు పొయ్యాలి. అందర్నీ పిలిచి భోజనాలు పెట్టాలి. అప్పుడు వాళ్ళంతా వచ్చి మర్యాద సరిగా జరగలేదని తిట్టిపోతారు. ఆడపిల్లలకి చిన్నపిల్లలప్పుడు పెళ్ళి చెయ్యటం పుణ్యం. అమ్మకు ఎనిమిదేళ్ళకు పెళ్లిచేసి తాతయ్య కన్యాదాన ఫలం పొందాడు. ఇప్పుడంతా పెద్ద పిల్లలకు పెళ్ళిచేస్తున్నారు. ఇట్లా చేస్తే పాపం. కలికాలంగనక ఇటువంటివన్నీ వస్తున్నై.

నేను పెద్దదాన్నయితే కొట్టే మొగుణ్ణి మాత్రం చేసుకోను. పుణ్యం లేకపోతే పీడాపాయె, ఎవరు పడతారమ్మా దెబ్బలూ, తిట్లూనూ ? పెద్దదాన్నయితే ఎవరికీ తెలీకుండా కిష్టమూర్తిగార్ని చేసుకుంటాను !...

"ఆడబ్రతుకే మధురం !" అనే పాటపాడటం మానేసింది రేడియో

